క్లుప్తంగా

కడ్తాల్‌లో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

కడ్తాల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారులు, చిరువ్యాపారులు తమతమ షాపుల్లోని, చెత్త వ్యర్థాలు రోడ్డుపైన వేయరాదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వ్యర్థాలు వేసినచో పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి జగన్, నాయకులు అంజి,రాజశేఖర్, కారోబార్ సాయిబాబా, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య అన్నారు. సోమవారం కమ్మగూడలోని 22వ వార్డు ఏపీ ఏటీ కాలనీ, ప్రగతి నగర్ ఫేజ్–2లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న చంద్రారెడ్డి, ఇందిరా దంపతులు

కడ్తాల్: బాలాపూర్ మండలం అల్మాస్‌గూడకు చెందిన చంద్రారెడ్డి, ఇందిరా దంపతుల పెద్ద కుమారుడు సుధీర్‌రెడ్డి గతేడాది మార్చి 13న మృతి చెందాడు. ఇదిలా ఉండగా సోమవారం సుధీర్‌రెడ్డి 31వ పుట్టిన రోజును పురస్కరించుకుని.. ఆయన జ్ఞాపకార్థం మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బాలరాజు, సర్పంచ్ తులసీరాం నాయక్, నాయకులు శివలాల్, ఉపాధ్యాయులు నయిమోద్దీన్, సరిత, మంజుల, సంతోష్‌కుమార్, శ్రావన్‌కుమార్, వెంకటయ్య, భగవతి, సుమతి సిబ్బంది ఉన్నారు.

విఠల్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లెక్కల విఠల్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సహకార సంఘం డైరెక్టర్లు, సిబ్బంది విఠల్‌రెడ్డిని ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు పాండు, గౌరెల్లి సర్పంచ్ మల్లేష్, మజీద్‌పూర్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి నాయకులు శంకర్‌యాదవ్, అల్లాజీ పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ ప్రారంభం



క్రికెట్ ఆడుతున్న ప్రశాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని సైంట్ కళాశాల సమీపంలో ఎఫ్2 (ఫన్ అండ్ ఫైర్) బాక్స్ క్రికెట్‌ను రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

హోమియోపతిక్ దినోత్సవం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ప్రపంచ హోమియోపతిక్ దినోత్సవాన్ని సోమవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. గురునానక్ హోమియోపతిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అదే కళాశాలలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు, వైద్య విద్యార్థులు, గురునానక్ హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండల కార్యాలయంలో 101 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం చేయని విధంగా కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ఈ ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ఎంతోమందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్య ఖర్చులు కూడా ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని పోయి మరింత చైతన్యం చేయాలన్నారు. ఆడపిల్లల చదువుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ నిత్యారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, తహసీల్దార్ అనిత, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ తేజ్‌సింగ్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీ చేయండి

గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య



వినతిపత్రం అందజేస్తున్న గొల్లకురుమలు

తలకొండపల్లి: గొల్లకురుమల ఆర్థికాభివృద్ధి చెందటానికి రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా గొర్రెలకు బదులుగా నగదు బదిలీని అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన పెంటయ్య గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల సహకార సంఘం అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్ బాల్‌రాజ్‌యాదవ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మొదటి విడత గొర్రెల పంపిణీలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని.. పశువైద్య అధికారులు, కిందిస్థాయి అధికారులు, మధ్యవర్తులు, దళారులు లాభపడ్డారని, రెండో విడతలో ఆ విధంగా జరుగకుండా చూడాలని విన్నవించారు. ఇప్పటివరకు 4లక్షల మందికి గొర్రెల పంపిణీ పూర్తయ్యిందని ఇంకా 3,72,000 మందికి గొర్రెల పంపిణీ చేయాల్సి ఉందని అన్నారు. గొల్లకురుమలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రవీందర్, సహాయ కార్యదర్శి మల్లేష్, రాష్ట్ర నాయకులు కొమురయ్య, బాలక్రిష్ణ, అనిల్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: క్రీడలు దేహ దారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాతకోటతండాలో ఐక్యతా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా దాతలు విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వరప్రసాద్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి టీమ్‌కి రూ.15,000, ద్వితీయ బహుమతి టీమ్‌కి రూ.10,000 అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, నాయకులు.. జీరానాయక్, సోమలింగం, శ్రీను, గోపి, పాండు, రూప్‌సింగ్, తిరుపతి, వెంకటేశ్, ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు యాదయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పస్మాములలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

హయత్‌నగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని.. అవకాశం ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేయాలని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం యూత్ కాంగ్రెస్, గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి సౌజన్యంతో పస్మాములలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు గాంధీ ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి, వృద్ధాశ్రమమంలో పండ్లను పంపిణీ చేశారు.

రేపు ఈజీఎస్ పనులపై సమీక్ష

కడ్తాల్: మాడ్గుల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 నిమిషాలకు 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాఘవులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచ్‌లు, సభ్యులు అందరూ సకాలంలో హాజరుకావల్సిందిగా ఎంపీడీఓ కోరారు.

మహిళలు స్వయం కృషితో ఎదగాలి

ఎంపీపీ కొప్పు సుకన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం కృషితో మహిళలు ఎదగాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి కోసం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెట్టడం కోసం రుణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గ్రామాల్లో ఉన్న 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉన్న 800లకు పైగా డ్వాక్రా సంఘాలకు వివిధ పద్దుల కింద రూ.100 కోట్లకు పైగానే రుణాలిచ్చినట్లు తెలిపారు. ఇకనుంచి గ్రామాల్లో జరిగే డ్వాక్రా సంఘాల సమావేశాలకు కూడా తాను హాజరవుతానని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఏపీఎం సతీష్, వివిధ గ్రామాల డ్వాక్రా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సాబేర్ అలీ

తుర్కయంజాల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. సోమవారం తుర్కయంజాల్‌లోని 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్ మేతరి అనురాధతో కలిసి ఆయన కంటి పరీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, వైద్యాధికారి నరసింహ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం 21వ వార్డులో..

ఇబ్రహీంపట్నం: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి కోరారు. ఇబ్రహీంపట్నంలోని 21వ వార్డులో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ బర్ల మంగతో కలిసి ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేదలందరికి కంటి వైద్యం చేయించేందుకు పట్టణాల్లో, పల్లెల్లో కంటి వెలుగు పథకం కింద పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేస్తుందన్నారు. అదేవిధంగా అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. టీఆర్ఎస్ నాయకుడు జగదీశ్వర్, కమిషనర్ యూసుఫ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం

ఎంపీపీ నిర్మల



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ నిర్మల ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ కిష్టమ్మతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరంలో 300 మంది రోగులకు దీర్ఘకాలిక, తాత్కాలిక పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ కిష్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, గౌడసంఘం కల్వకుర్తి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ అశోక్‌గౌడ్, జగన్, రంగారెడ్డి, కుమార్, వెంకటయ్య, శేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, మధు, వెంకటేశు, మల్లేష్, లింగయ్య, రాఘవేందర్, శేఖర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు

మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్

కడ్తాల్: రూ.4 కోట్లతో ఆమనగల్లు మున్సిపాలిటీలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ దుకాణ సముదాయ పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని వెంటనే విజిలెన్స్ విచారణ జరిపించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యతో పాటు పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు.ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటేడ్ మార్కెట్ దుకాణ సముదాయ పనులను స్థానిక కౌన్సిలర్లతో కలిసి సోమవారం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో గుత్తేదారు నాణ్యతా ప్రమాణాలు గాలికొదలడంతో నిర్మాణ దశలోనే పునాదుల్లో పగుళ్లు వచ్చి కూలిపోయే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, లక్ష్మణ్, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు శ్రీధర్, నాయకులు ఉన్నారు.

'చెన్నకేశవ దేవస్థానం కమిటీ ఎన్నిక చెల్లదు'

కడ్తాల్: ఆమనగల్లులో ఆదివారం నూతనంగా ఎన్నుకున్న శ్రీ చెన్నకేశవ దేవస్థానం నూతన కమిటీ ఎన్నిక చెల్లదని కులసంఘం పెద్దలు రామలింగయ్య, నర్సింహ అన్నారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలో వారు మాట్లాడుతూ.. చెన్నకేశవ దేవస్థానం అధ్యక్షులకు, కార్యదర్శులకు కూడా సమాచారం ఇవ్వకుండా కేవలం రెండు, మూడు కుటుంబాలకు చెందిన వారు మాత్రమే ఆమనగల్లు శ్రీ చెన్నకేశవ దేవస్థానం కమిటీ ఎన్నుకోవడం సరికాదన్నారు. ఆలయ కమిటీని అందరి సమక్షంలో ఎన్నుకోలేదని..ఈ కమిటీ ఎన్నిక చెల్లదని వారు అన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక చెల్లదని మద్దతుగా సంతకాలు సేకరించారు. రాములు, నర్సింహ, యాదగిరి, మల్లేశ్, శేఖర్, చెన్నకేశవులు, ప్రశాంత్, మల్లేశ్, తలారి మహేశ్, లండం మల్లేశ్, ప్రవీన్, శేఖర్, శంకర్, శివ, రవి, మహేశ్, పర్వాతాలు, భరత్ ఉన్నారు.





